నమస్తే తెలంగాణ

# మెదక్

13 హైదరాబాద్, మంగళవారం 20 ఫిబ్రవరి 2024 MEDAK




సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ఎల్లమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

# కురుమల ఆర్థిక సంపద పెరగాలి

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని సంగుపల్లిలో బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

గజ్వేల్, ఫిబ్రవరి 19: కుర్మల ఆర్థిక సంపద పెరగాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని సంగుపల్లిలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకోగా ఆలయ నిర్వాహకులు సన్మానించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడారు. బీరప్ప దయతో తెలంగాణ పల్లెలు పచ్చని పంటలతో సస్యశ్యామలమై ప్రజలంతా సంతోషంగా ఉండాలని దేవుడిని కోరుకున్నట్లు తెలిపారు. కేసీఆర్ వచ్చిన తర్వాత గజ్వేల్ రూపురేఖలు పూర్తిగా మారాయని, కేసీఆర్‌తోనే గజ్వేల్ అభివృద్ధి చెందిందన్నారు. తాగు, సాగునీటి సమస్య తీరిందని చెప్పారు. విద్యుత్, రహదారులను అద్భుతంగా మార్చారన్నారు. ఒకప్పుడు మూగజీవాలకు నీళ్లు దొరకని పరిస్థితి కనిపించేదని, కేసీఆర్ వచ్చిన తర్వాత ఎండాకాలంలో ఏ చెరువు, కుంటను చూసినా నీళ్లు ఉంటున్నాయన్నారు. కేసీఆర్ కృషి ఫలితంగా కాళేశ్వరం నిర్మాణం జరిగిందన్నారు. ఊరూరా బీరప్ప జాతర జరుపుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. హైదరాబాద్‌లో కుర్మల ఆత్మగౌరవ భవనానికి స్థలం ఇచ్చి అద్భుతంగా నిర్మించామన్నారు. కేసీఆర్ మెదక్ జిల్లాకు, గజ్వేల్‌కు ఎంత చేశారో మీకే ఎక్కువ తెలుసన్నారు. సద్దితిన్నరేవు తలవాలని, బీరప్ప దయతో కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జడ్పీటీసీ మల్లేశం, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు రజిత, శ్రీనివాస్, అల్వాల బాలేష్, అత్తెల్లి శ్రీనివాస్, నాయకులు అనిల్‌కుమార్, తిరుపతిరెడ్డి, నగేశ్, టి.రాజు, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, నాయకులు ఉడెం కృష్ణారెడ్డి, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, సంగుపల్లి బీరయ్య, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

### రేణుకా ఎల్లమ్మ ఆలయంలో....

గజ్వేల్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హరీశ్‌రావును ఆలయ నిర్వాహకులు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు రాజాగౌడ్, అశోక్‌గౌడ్, రెగొండగౌడ్, నరేశ్‌గౌడ్, వెంకట్‌గౌడ్, రమేశ్‌గౌడ్, కల్యాణ్‌కర్ నర్సింగరావు, రవీందర్ పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని సంగుపల్లిలో బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

### శివాజీ జయంతిలో పాల్గొన్న హరీశ్‌రావు

గజ్వేల్ పట్టణంలోని పిడిచేడ్ మార్గంలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు ర్యాలీతో శివాజీ విగ్రహం వద్దకు నిర్వాహకులు చేరుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గుంటుకరాజు, గంగిశెట్టి రవీందర్, స్వామిచారి, సంతోష్‌గుప్తా, తాళ్ల నరేశ్‌గౌడ్, సంపత్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ప్రతాప్‌రెడ్డి

# సాహో శివాజీ

- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఛత్రపతి శివాజీ జయంతి
- ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల నివాళి
- భారీఎత్తున బైక్ ర్యాలీలు
- నినాదాలతో హోరెత్తిన పల్లెలు, పట్టణాలు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సోమవారం ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు శివాజీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నినాదాలతో పల్లెలు, పట్టణాలు హోరెత్తాయి. శోభాయాత్రలతో పాటు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీలు నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని పిడిచేడ్ మార్గంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక పట్టణంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఛత్రపతి విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. నేటి యువత శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

–ఉమ్మడి మెదక్ జిల్లా నెట్‌వర్క్, ఫిబ్రవరి 19



దుబ్బాకలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



ఆర్సీపురంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్



మనోహరాబాద్ మండలం రామాయిపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి



సిద్దిపేటలో భరోసా సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అనురాధ

# మర్యాదగా ప్రవర్తించాలి

- భరోసా సిబ్బందికి సిద్దిపేట సీపీ అనురాధ ఆదేశం
- సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్, భరోసా, సఖీ సెంటర్ పనితీరును తెలుసుకున్న సీపీ

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 19: సిబ్బంది మర్యాదగా ప్రవర్తించి సమస్యను తెలుసుకోవాలని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్, భరోసా, సఖీ సెంటర్లను సోమవారం ఆమె సందర్శించి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఐఎస్ అమలులో భాగంగా ఫైళ్లను తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటు లో ఉండాలని సూచించారు. భరోసా సెంటర్‌కు వెళ్లి నమోదవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు భరోసా కల్పించాలని, మహిళలు, పిల్లలకు సకాలంలో సేవలు అందించాలన్నారు. సఖీ సెంటర్‌ను సందర్శించి మహిళలు, అనాథ మహిళలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై అపూర్వరెడ్డి, సిబ్బందితో మాట్లాడారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇసుక, పీడీఎస్ బియ్యం, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాలు, మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి ప్రజలు, యువత, విద్యార్థినులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సీపీ వెంట రూరల్ పోలీస్‌స్టేషన్, భరోసా, సఖీ సెంటర్ సిబ్బంది ఉన్నారు.

# హంగుఆర్భాటాలకే కాంగ్రెస్ పరిమితం

- సాగునీటి ప్రాజెక్టులపై కక్షపూరిత రాజకీయం
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- సిద్దిపేట జిల్లా దుబ్బాకలో కల్యాణలక్ష్మి చెక్కులు, ట్రైసైకిళ్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

దుబ్బాక, ఫిబ్రవరి 19: కాంగ్రెస్ ప్రభుత్వం హంగు ఆర్భాటాలకే పరిమితమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గ కేంద్రంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా దుబ్బాక పట్టణంలోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద 20 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు యూనిఫాం (చీరలు) దుస్తులు అందజేశారు. అనంతరం స్థానిక రజినీకాంత్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గంలోని దుబ్బాక మున్సిపల్, మండలంలో 60 మందికి, అక్బర్‌పేట–భూంపల్లి మండలంలో 39 మందికి, తొగుట మండలంలో 55 మందికి మొత్తం 154 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరువు కాటకాలకు నిలయమైన తెలంగాణను పచ్చని పంటలతో సస్యశ్యామలం చేసి కాళేశ్వరంతో రైతులకు సాగునీటి కష్టాలను శాశ్వతంగా దూరం చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా రాజకీయం చేస్తుందని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సాగునీరు, గ్రామీణ ప్రజలకు తాగునీరు , కరెంట్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయని గుర్తుచేశారు. ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వకుండా ఎన్నికల్లో ఓడిపోయిన, డిపాజిట్ రాని కాంగ్రెస్ నాయకులకు నిధులు కేటాయించడం విడ్డూరంగా ఉన్నదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజారంజక పాలన అందించిందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సైతం అమలు చేసిందని గుర్తు చేశారు. పేదింటి ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక భరోసా కల్పించేందుకు కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అమలు చేశారన్నారు. దివ్యాంగులకు నెలకు రూ. 4016 ఆసరా పింఛన్ మంజూరు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అస్క రవి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, తహసీల్దార్లు వెంకట్‌రెడ్డి, జయంత్, ఐసీడీఎస్ సీడీపీవో చంద్రకళ పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా దుబ్బాక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలి

గజ్వేల్, ఫిబ్రవరి 19: ధూపదీప నైవేద్య అర్చకుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం చేపట్టనున్న చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ధూప, దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ కోరారు. ఈసందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ డీడీఎన్ఎస్ అర్చకులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, కొత్తగా నియమితులైన డీడీఎన్ఎస్ అర్చకులకు ఏడు నెలల వేతనాలు ఇవ్వాలన్నారు. అలాగే అర్చకుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎలాంటి ఆదాయం, ఆదరణలేని దేవాలయాలకు నిత్యం ధూపదీప నైవేద్యాలు జరగాలని పథకం ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 6500 దేవాలయాలకు ఈ పథకాన్ని విస్తరించారన్నారు.

# ఓటరుగా నమోదు చేసుకోవాలి

- మెదక్ కలెక్టర్ రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): భారతదేశం ప్రజాస్వామ్య దేశం, ప్రజలే ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రక్రియలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఓటుతో దేశాన్ని, భవిష్యత్తును మార్చుకోవాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏప్రిల్ 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు నూతన ఓటరుగా ఫామ్ 6 ద్వారా తమ పేరు నమోదు చేసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త ఓటర్ల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లను ఆదేశించారు. కొత్త ఓటరుగా నమోదు చేసుకునేలా యువతకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని కోరారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం బూత్ లెవల్ అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామాల వారీగా ఫామ్ 6 ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, బీఎల్‌వో, బీఎల్‌వోల సూపర్‌వైజర్ల ద్వారా సమాచారం తెలుసుకోవాలన్నారు. త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు.

## పారదర్శకంగా ఓటరు జాబితా

మెదక్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్ టర్న్ అవుట్ పెరిగే విధంగా విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వీప్ కార్యక్రమాల నిర్వహణ, పెండింగ్ ఓటరు దరఖాస్తులు వంటి పలు అంశాలపై ఆయన సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మెదక్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ రమేశ్ పాల్గొన్నారు.

# దళితబంధు నిధులు జమచేయాలి




సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దళితబంధు సాధన సమితి నాయకులు

- దళితబంధు సాధన సమితి సభ్యులు
- సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట నిరసన

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 19: రెండో విడత దళితబంధు నిధులను వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయాలని దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ డిమాండ్ చేశారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం రెండో విడతలో లబ్ధిదారులకు రూ.10 లక్షల చొప్పున మంజూరు చేసిందని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆ నిధులను ఫ్రీజ్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ ముగిసి మూడు నెలలు గడుస్తున్నా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు ఎందుకు జమ చేయడం లేదని ప్రశ్నించారు. వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో దళితబంధు డబ్బులను జమచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

- అక్కడికక్కడే ముగ్గురి మృతి
- రాంగ్‌రూట్‌లో వెళ్తున్న బైక్‌ను ఢీకొన్న కారు

అల్లాదుర్గం, ఫిబ్రవరి 19: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందిన ఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 161వ జాతీయ రహదారిపై గడిపెద్దాపూర్ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పాపన్నపేట మండలం బాచారం గ్రామానికి చెందిన గడ్డం ప్రభాకర్(28), గడ్డం భూమయ్య(30), అల్లాదుర్గం శ్రీకాంత్ (24) మాసయ్య నలుగురు కలిసి ద్విచక్రవాహనంపై రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. గడిపెద్దాపూర్ వద్ద ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీ కొట్టడంతో ప్రభాకర్, భీమయ్య, శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాదంలో తీవ్ర గాయాలైన మాసయ్యను 108లో జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

# తెలంగాణకు తలమానికం ఐఐటీహెచ్

- కార్యక్రమంలో పాల్గొననున్న గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్
- సంగారెడ్డి జిల్లాకు తలమానికంగా ఐఐటీ హైదరాబాద్
- కందిలో 576 ఎకరాల్లో అధునాతన క్యాంపస్ నిర్మాణం
- రెండు దశల పనులు పూర్తి, కొనసాగుతున్న మూడో దశ

### నేడు జాతికి అంకితం చేయనున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ



సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీహెచ్ క్యాంపస్

సంగారెడ్డి ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం జాతికి అంకితం చేయనున్నారు. గత ఏడాది రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని ఐఐటీ హైదరాబాద్‌ను జాతికి అంకితం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే, అనివార్య కారణాల వల్ల సంగారెడ్డి జిల్లా పర్యటన ఖరారు కాకపోవడంతో ఆన్‌లైన్‌లో ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌ను జాతికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, జపాన్ రాయబారి సుజుకి హిరోషి, జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సాచికో ఇమోటో, ఐఐటీ పాలకవర్గ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి పాల్గొననున్నారు. ఆ సందర్భంగా ప్రధాని మోదీ ఆన్‌లైన్‌లో ప్రసంగించనున్నారు. రెండవతరం ఐఐటీ ఏర్పాటులో భాగంగా అప్పటి యూపీఏ సర్కారు తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో ఐఐటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. 18 ఆగస్టు, 2008లో జిల్లాలోని ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఆవరణలో ఐఐటీ హైదరాబాద్ ప్రారంభమైంది. శాశ్వత క్యాంపస్ ఏర్పాటు కోసం కంది గ్రామంలో 576 ఎకరాలు కేటాయించగా, ఫిబ్రవరి 27, 2009లో అప్పటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 20వేల మంది విద్యార్థులతో పాటు 10వేల మంది బోధన, ఇతర సిబ్బంది కోసం క్యాంపస్ నిర్మాణాన్ని 2010లో ప్రారంభించారు. భారత ప్రభుత్వం, జపాన్‌కు చెందిన జైకా సంస్థ కలిసి 2019 వరకు మొదటి దశ నిర్మాణం పనులు పూర్తి చేశాయి. జూలై 2015లో ఐఐటీ హైదరాబాద్‌ను ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ నుంచి కందిలోని శాశ్వత క్యాంపస్‌లోకి మార్చారు. మొదటి దశ పనుల కోసం కేంద్ర ప్రభుత్వం, జపాన్‌కు చెందిన జైకా కలిసి సుమారు రూ.1700 కోట్లు ఖర్చు చేశాయి.

### రూ.1000 కోట్లతో రెండో దశ..

ఐఐటీ హైదరాబాద్ శాశ్వత క్యాంపస్ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. పూర్తి పర్యావరణహితంగా, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేలా నిర్మాణం జరుగుతుంది. ఇప్పటి వరకు మొదటి, రెండో దశ నిర్మాణం పనులు పూర్తి కాగా, మరో ఆరుమాసాల్లో మూడో దశ పూర్తయ్యే అవకాశాలున్నాయి. ఆ తర్వాత నాలుగు, ఐదో దశ చేపట్టనున్నారు. రెండో దశను 2023లో కేంద్ర ప్రభుత్వం రూ.1000 కోట్లతో చేపట్టింది. అంతర్జాతీయ ప్రమాణాలతో మూడంతస్తుల కన్వెన్షన్ సెంటర్, అధునాతన నాలెడ్జ్ సెంటర్ నిర్మించారు. విద్యార్థుల కోసం పది హాస్టల్ భవనాలు నిర్మించారు. యువకులు, యువతుల కోసం వేర్వేరుగా హాస్టల్ ఉన్నాయి. ఎంటెక్, పరిశోధనలు చేసే జంటల కోసం ప్రత్యేకంగా నాలుగు అంతస్తుల హాస్టల్స్, ఓపెన్ స్టేడియం, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, కల్చరల్ సెంటర్, 15 లెక్చర్ హాల్స్ నిర్మించారు. ఒక్కో లెక్చర్ హాల్‌లో 1254 మంది విద్యార్థులు కూర్చుని చదువుకునే అవకాశం ఉన్నది. ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, లిబరల్ ఆర్ట్స్ కోర్సులు చదివే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా భవనాలు ఉన్నాయి. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, బీటెక్, ఎంటెక్ విద్యార్థుల కోసం ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంజినీరింగ్ గ్రాఫిక్స్ కోర్ ల్యాబ్ భవనాలు నిర్మించారు. క్యాంపస్‌లో ప్రత్యేకంగా రీసెర్చ్ పార్కు, స్టార్టప్ కంపెనీల కోసం ఇంక్యుబేషన్ సెంటర్లు ఉన్నాయి.




### రెండోతరం ఐఐటీల్లో ప్రత్యేక స్థానం

కందిలోని ఐఐటీ హైదరాబాద్ సంగారెడ్డి జిల్లాకు తలమానికంగా మారింది. రెండో తరం ఐఐటీల్లో దేశంలోనే ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. నాలెడ్జ్ ర్యాంకింగ్‌లో ఐఐటీహెచ్ మూడో స్థానం, నిర్ఫ్ ర్యాంకింగ్‌లో పదిలోపు స్థానంలో ఉంది. ఐఐటీ లో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీతో పాటు అనేక కొత్త కోర్సులను అందజేస్తోంది. ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో బీటెక్ కోర్సును ప్రారంభించింది. ఇక్కడ 4800 మంది విద్యార్థులు, 300 మందికిపైగా ప్రొఫెసర్లు ఉన్నారు. ఐదు పరిశోధన కేంద్రాలున్నాయి. పరిశోధనలపై ఐఐటీహెచ్ రూ.900 కోట్లకుపైగా నిధులు ఖర్చు చేస్తోంది. 5జీ, 6జీ టెక్నాలజీ రూపకల్పనలో కీలకపాత్ర పోషిస్తుంది. ఇతర ఏజెన్సీలతో కలిసి 1668 కొత్త ప్రాజెక్టులపై పరిశోధనలు చేస్తుంది. ఐఐటీహెచ్ నుంచి 135 స్టార్టప్ కంపెనీలు వచ్చాయి. ఇవి ప్రతిఏటా రూ.800 కోట్లకుపైగా ఆదాయం సమకూర్చుకుంటున్నాయి. ఐఐటీహెచ్‌లో విద్యనభ్యసించిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ కంపెనీల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించి మంచి వేతనాలు పొందుతున్నారు